

# టూ నెగెటివ్స్

'యామిని'

టెలిఫోను మ్రోగింది.

టైపిస్టు సత్యనారాయణవైపు చూసి మాట్లాడమని సైగచేసి నేను మళ్ళీ ఫైలులో తల దూర్చేను.

“టెలిఫోను మీకే సార్! ఇందాక నేను నెంబరు నోట్‌చేసి ఇచ్చేను ఆయనే!” అన్నాడు సత్యనారాయణ

అవును. మధ్యాహ్నం మూడు గంటలకు టీకి వెళ్ళరాగానే సత్యనారాయణ టెలిఫోన్ నంబరున్న చీటీ ఒకటి చేతికిచ్చాడు.

**1979 చక్రపాణి మూడవ అవార్డు పొందిన కథ**

"పేరు?" అన్నాను నంబరు చూస్తూ.

"సారీ సర్। అడగడం మరచిపోయేను."

నాకు పరిచయమున్న అందరి టెలిఫోను నంబర్లూ ఓసారి గుర్తుతెచ్చుకున్నాను ఈ నెంబరు గుర్తు లేదు.

సరే డయల్ చేద్దామని టెలిఫోను తియ్యబోతూంటే ఎదురుగా గేటు దగ్గర మాబాస్ ప్యూన్ నిలబడి రమ్మంటున్నారని సైగచేసేడు

వెళ్ళివచ్చి ఆయన అడిగిన ఇన్ఫర్మేషన్ కోసం ఫైలు చూస్తూ ఆ చీటీ సంగతే మరచిపోయేను.

మళ్ళీ ఇప్పుడు టెలిఫోను .

"హల్లో। రాజేశ్వర్రావ్ హియర్।" అన్నాను సత్యనారాయణ చేతిలో రిసీవర్ అందుకొని.

"హలో। నేనురా మధూని... "

"మధు " 'రా' అని పిలిచే చనువున్న మనిషి ఎవరా అని ఆలోచించి రాంగ్ నంబరేమో ననుకొన్నాను. ఇంతలో "రాంగ్ నంబర్ కాదురా ఇడియట్। నేను మధుమూర్తినిరా। వన్సపానే టైమ్ నీ బూజమ్ ఫ్రెండని। ఎటొచ్చి మనం కలుసుకొని ఓ పాతిక సంవత్సరాలు దాటిందనుకో। " అని మళ్ళీ అటుపైపునుంచి మాట్లాడుతూంటే మెదడులో తళుక్కున మెరిసింది.

"ఏరా। గుర్తుకొచ్చేనా ?"

"యస్। హౌ డూ యూ డూ।" అన్నాను.

"ఆల్రైట్ అది సరే। ఉదయం నుంచి మీ ఆఫీసు ఎక్కడుందో తెలుసు కొని నీ బయోడేటా అంతా చెప్పి నువ్వే సెక్షన్‌లో ఉన్నావో కనుక్కొని నీ నెంబరు తెలుసుకొని నీతో మాట్లాడే సరికి ఈ టైమయింది మీ ఆఫీసుకు ఇల్లు చాలా దూరమా ?"

"లేదు ఓ అరమైలుంటుంది."

"ఎడ్రసు।ఎందుకులే। ఎడ్రసు వద్దు. సందులూ గొందులూ తిరిగి పట్టుకోగలనో లేనో। నేను వచ్చేంతవరకూ వైట్ఫోంట్యూ వెయిట్ ఇన్యువరాఫీస్।"

"నన్ను కలుసుకోవాలనా ?"

"అఫ్‌కోర్స్"

"ఎందుకు?" అన్నమాట అప్రయత్నంగా కఠినంగా వచ్చేసింది నా నోట్లోంచి.

"ప్లీజ్ వెయిట్। నే నిప్పుడే బయలుదేరుతున్నాను" మధు టెలిఫోను పెట్టేసేడు.

రిసీవర్ పెట్టేసేను. ఎదురుగా ఉన్న ఫైల్ చూడబుద్ధి కాలేదు.

టైమ్ చూసేను. నాలుగూ ఇరవై అయింది.

ఫైల్ మూసి టేబిల్ సర్దేశాను.

* * *

అవి పౌరాణిక నాటకాలు జోరుగా నడుస్తూన్న రోజులు.

సాంఘిక నాటకాలు వేసే వాళ్ళు వాటిని ఒక విప్లవ ధోరణిలోనూ,

పౌరాణిక నాటకాలు వేసేవాళ్ళు వీళ్ళని అస్పృశ్యులుగానూ చూస్తూన్న రోజులు.

నేనోసారి నాటిక ఒకటి డైరెక్టు చేస్తూంటే ఎవరితోనో మొదటిసారిగా వచ్చేడు మధుమూర్తి.

ఆ రోజు రిహార్సలు అయ్యేవరకూ ఉన్నాడు. తర్వాత పరిచయం చేసుకొని వెళ్ళిపోయేడు.

వారం రోజుల తర్వాత మళ్ళీ రిహార్సలు వేసేచోటికి వచ్చి చివరివరకూ కూర్చొని తర్వాత తమకొక నాటికని డైరెక్టు చేసిపెట్టమని అడిగేడు ఆ నాటి నుండి మధు వేషాలేసిన నాటకాలన్నిటికి డైరెక్టరు నేనే.

'ఏమండీ!' అని అతిమర్యాదగా మొదలయిన పరిచయం అయిదు సంవత్సరాలలో 'ఏరా ఇడియట్!' వరకూ వచ్చేసింది.

మధు తల్లిదండ్రులు కూడా నన్నెంతో ప్రేమగా చూసుకొనేవారు.

నెలకు రెండు మూడు రోజులు నాకు వాళ్ళింట్లోనే గడచిపోయేది.

అప్పుడు మధు ఒక ప్రయివేటు కంపెనీలో పనిచేస్తూండేవాడు.

ఓరోజు ఆఫీసుకు టెలిఫోనుచేసి సాయంత్రం అర్జెంటుగా ఇంటికి రమ్మన్నాడు. వెళ్ళాను. మధు నీటుగా ముస్తాబయి ఉన్నాడు. నాకోసమే ఎదురు చూస్తూన్నాడు.

"ఇంత ఆలస్యమే మిత్రా ఇడియట్!" అన్నాడు.

"ఎక్కడికి ముస్తాబయ్యేవు?"

"అమ్మాయిని చూడ్డానికి"

"నే నెందుకు?"

"నువ్వులేకపోతే నాకేంతెలుస్తుంది?"

"ఏడిసినట్లుంది. మీ అమ్మనీ నాన్ననీ తీసుకెళ్ళు."

"నథింగ్ డూయింగ్!"

పెళ్ళి చూపులకు వెళ్ళేం.

అమ్మాయి అపరంజి బొమ్మ. అప్పటి వరకూ నేనంత అందమైన అమ్మాయిని చూడలేదు. అక్కడున్నంతసేపూ మధు అమ్మాయిమీద నుంచి తలతిప్పుకోలేక పోవడం చూసేను.

బయటికొచ్చేక "ఎలా ఉందిరా?" అన్నాడు.

"వాళ్ళని ఓ పసుపు కొమ్ముడిగి పుచ్చుకొని వెంటనే కట్టేసెయ్ అమ్మాయి మెడలో! ఏమయినా అడ్డుపెడితె ఎంత డిగితే అంత డబ్బు ఎదురు కట్నం ఇచ్చి చేసేసుకో! అదీ కాదంటే నీ అందానికి బానిసనై జన్మంతా నీ కాళ్ళ దగ్గర కుక్కలా పడిఉంటానని హామీ రాసిచ్చేసెయ్! "

ఆ అమ్మాయితో మధుమూర్తి పెళ్ళయిపోయింది.

నాకూ మధుకూ మధ్య రహస్యాలేవీ లేవు. వాడు వాడి పెళ్ళాంతో భూమ్మీద స్వర్గాన్ని చవిచూసేడు. వాడు తల్లి

అన్నింటిలో అదృష్టవంతుడు! కాని అన్నింటికంటె మించిన అదృష్టం 'మా ఆవిడ' అంటుండేవాడు.

ఆ రాత్రి నాటికల పరిషత్తు.

నేను డైరెక్టుచేసిన 'చర్విత చర్వణం' నాటికలో మధుమూర్తి హీరో. మొదటి సగభాగంలో యావనం — అధికారం — సంపదల దర్పంలో బాధ్యతలు గుర్తించక ముసలి తండ్రిని అవమానపరుస్తాడు. రెండవ సగభాగంలో తానే ముసలివాడై బాధ్యత తెలియని సంతానంచేత అవమానింపబడి కష్టనిష్ఠూరాల మధ్య పశ్చాత్తాప పడతాడు. మధు బాగానే నటించేడు. ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకున్నాడు. నాటికలో అద్యంతం చాలా సన్నివేశాల్లో వాడి నటనకు సంభాషణలు ఉచ్చరించిన తీరుకు వరుసగా ప్రేక్షకుల్లోంచి హర్ష ధ్వానాలు వస్తూనే ఉన్నాయి.

అందరూ ఉత్తమ నటుడి బహుమతి తప్పకుండా వాడికే వస్తుందనుకున్నారు.

కాని జడ్జెస్ ఆ బహుమతి వేరే నటుడి కిచ్చేరు. అది చాలా క్లిష్టమైన పాత్ర. ప్రేక్షకులకు ఎక్కువగా అది అవగాహన కాలేదు. అది రచనలో లోపం. కాని అతడు మాత్రం చాలా అద్భుతంగా నటించేడు. తీర్పు నాకు సమంజసంగానే కనబడింది. అఫ్‌కోర్స్ మధు చాలా నిరుత్సాహపడ్డాడు. వచ్చింది.

ప్రదర్శనలయి బయటకు వచ్చేసరికి పరిచయస్థులందరూ చుట్టుముట్టేరు. మామూలుగా ఇరానీ హోటల్‌కు పోయి టీ త్రాగుతూ ఎవరకి తోచినట్లు వాళ్ళు వాగి టైము చూసుకొనేసరికి రాత్రి ఒంటిగంటవుతూంది.

"ఇప్పుడెక్కడికి పోతావ్‌రా ఇడియట్! రాత్రి మాయింటి దగ్గర పడుకొని తెల్లారేక కాఫీ తాగిపో!" అన్నాడు మధు. అది కూడా మాకు మామూలే.

ఇంకో పదిసార్లు వాడిచేత ఇడియట్ అనిపించుకోవడం ఎందుకని సరేనని కూడా వెళ్ళేను.

ఇంటికెళ్ళి తలుపు కొట్టేసరికి మధు నాన్నగారు తలుపు తీసేరు.

నాటకాలూ వేషాలూ అంటూ అర్ధ రాత్రి అపరాత్రి లేకుండా తిరుగుతున్నారని తిట్టని ముసలాళ్ళెవరైనా ఉంటే వాళ్ళ తల్లిదండ్రులే. అందుకనే వాళ్ళింటికి వెళ్ళడం ఆ సమయంలో మా ఇంటికివెళ్ళి తలుపు తట్టినంత ఇబ్బందిగా కూడా ఉండదు.

తలుపు తీస్తూనే ఆయన నన్ను చూసి, "రావోయ్ నాటకాలరాయుడూ!" అన్నారు నవ్వుతూ.

ఆయన తన మంచంమీద పడుకొని

నాటకాల గురించి వివరాలడిగి నేను చెప్తూంటేనే గుర్రుపెట్టి నిద్రపోయారు.

మధు తన గదిలోకి తీసుకెళ్ళి లుంగీ పంచె ఒకటి చేతికిచ్చేడు. నేను వరండాలో పడుకుంటానన్నా వినకుండా వాడి మంచంమీద పక్క సవరించి వాడు లోపలగదిలోకి వెళ్ళిపోయేడు

నేను అలా పడుకున్నానో లేదో నిద్రపట్టేసింది.

ఆ రాత్రి వచ్చిన కల మాత్రం స్పష్టంగా గుర్తుంది.

ఎక్కడనుంచో .... ఎక్కడికో .... గూడుపడవలో ప్రయాణం చేస్తున్నాను. లోపలంతా జనం నిండిపోయేరు. ప్రక్కకు ఒరుగుదామన్నా చోటు లేదు నాకు నిద్ర కళ్ళు కూరుకుపోతున్నాయి.

చుట్టూ చూసేను.

గూడులోంచి బయటకు వచ్చేను. చుక్కానివైపు బల్లమీద కాస్త ఖాళీ ఉంది. చుక్కానిమీద చేయివేసి వెల్లకిలా పడుకొని చుక్కలవైపు చూస్తూన్నాను.

"కొంచెం జరగండి !"

ఉలిక్కిపడి పక్కకు తిరిగి చూసేను.

ఎవరో అమ్మాయి! అందంగా ఉంది! నీళ్ళలో తడిసిపోయి ఉంది. నా ప్రక్కనే పడుకొంది.

"నిద్ర ముంచుకొచ్చేస్తూంది లోపల ఖాళీలేదు" అంటూ పడిపోకుండా ఉండడానికి అన్నట్లుగా నావైపు తిరిగి నన్ను గట్టిగా పట్టేసుకుంది

"నీళ్ళల్లో పడతావ్! జాగ్రత్త!" అని అప్రయత్నంగా నే నామెను పట్టుకున్నాను. దగ్గరగా లాక్కున్నాను. ఒళ్ళంతా నిమిరేను అలా ఎంతసేపు ఉన్నానో తెలీదు. ఆమె అర్ధనగ్న శరీరం నాకు తగులుతూంటే ఉద్రేకంతో నా ఒళ్ళు వేడెక్కిపోయింది.

ఉన్నట్లుండి ఆమె నీళ్ళల్లోకి జారిపోతూన్నట్లనిపించింది. ఒళ్ళు తెలియని ఉద్రేకంలో ఆందోళనగా బలంగా దగ్గరగా లాకున్నాను. ఆమె బలంగా కాళ్ళూచేతులూ విదిలించుకుంది. పడవ అంచుమీంచి నీళ్ళల్లోకి జారిపోయింది.

నా గుండె ఝల్లుమంది.

కల చెదరిపోయింది.

ఉలిక్కిపడి మంచంమీద లేచి కూర్చున్నాను.

కళ్ళు తెరచి చూసేను.

ఎదురుగా నగ్నంగా మధుపెళ్ళాం!

నాకు తల తిరిగిపోయింది.

ఆమె ఒక్కక్షణం రాక్షసుణ్ణి చూసినట్లు నా ముఖంలోకి చూసి, నా చేతిలో చీర లాక్కుని భోరున ఏడుస్తూ గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది.

జరిగిన విషయం ఊహించగలిగే సరికి ఓ నిముషం పట్టింది.

అప్పటికి ఒంట్లో వేడంతా చల్లారిపోయింది

నా గదిలో చిన్నదీపం తప్ప మిగిలిన గదుల్లో వెలుగులేదు. పక్క గదిలోంచి



ఆమె ఏడుపూ, ఎక్కిళ్ళూ వినిపిస్తున్నాయి. ఎవరూ ఇంట్లో నిద్రలేచినట్లు లేదు.

నా కళ్ళు భగ్గున మండిపోతున్నాయ్. గుండెల్లో తెలియని గుబులు గూడుచేసుకుంటూంది.

ఇంకా నయం! ఎవరూ చూడలేదు! మధు చూసి ఉంటే ఏమనుకునేవాడో ఏమో!....

మళ్ళీ ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు.

తిరిగి కళ్ళుతెరిచేసరికి పూర్తిగా ఎండలు వచ్చేసేయి. లేవగానే రాత్రి సంఘటన కలలా గుర్తుకొచ్చింది ఎంతో సిగ్గనిపించింది.

అలాగే బాత్‌రూమ్‌కు వెళ్ళి ముఖం కడుక్కొని తిరిగి గదిలోకి వచ్చేను. మంచం పక్క చిన్న స్టూల్‌మీద పొగలు కక్కుతూన్న కాఫీ ఉంది. ఓ నిముషం మధు వస్తాడేమోనని చూసేను. వాడు రాలేదు. కాఫీ చల్లారిపోతూందని మెల్లిగా కాఫీ తాగేసి బట్టలువేసుకుంటూంటే ఇంట్లోనే దూరంగా సన్నని ఏడుపు వినిపిస్తూంది. ఆమే! రాత్రి మధు పెళ్ళాం ఏడుపు గుర్తుకొచ్చింది.

ఇంకా ఏడుస్తూంది! సందేహంలేదు!

మైగాడ్! నాకొక్కసారి వెన్ను అదిరింది.

"ఏడవడం ఎందుకు? ఊరుకో! అడ్డమయినవాళ్ళనూ చేరనియ్యడం తప్పు మనది!" మధు నాన్నగారి కంఠం వినబడింది. తలెత్తి చూసేసరికి ఆయన కత్తులు దూసినట్లు నావైపు చూసి గది ముందునుంచి బయటకు వెళ్ళిపోయేరు.

నాకు కాళ్ళలో వణుకు మొదలయింది.

వెంటనే మధు వచ్చేడు. ఎందుకో వాడి ముఖంలోకి చూడలేకపోయేను. ఏదో చెప్పాలనిపించింది కాని గొంతు పెగల్లేదు.

అప్రయత్నంగా ఇంట్లోంచి బయటకు వచ్చేను. వెనకాలే మధు వచ్చేడు. జరుగుతూన్న నిశ్శబ్దంతో ఏదో నా మెడ చుట్టూ తాడు బిగిసిపోతూన్నట్లనిపించింది. జరిగింది జరిగినట్లుగా వెంటనే చెప్పెయ్యడం అత్యవసరం అనిపించింది.

శక్తినంతా కూడగట్టుకొని వాడివైపు తిరిగి, "మధూ!... " అని నోరు తెరిచేను.

"నువ్వేం చెప్పనక్కర్లేదు. మా ఆవిడ అంతా చెప్పింది. మంచంమీద ఉన్నది నేనేననుకొని పొరపాటుపడింది. అంతమాత్రంచేత పది నిముషాలు అక్కడ ఉన్నది నువ్వని తెలీసీ కుడా .... హౌ అన్‌స్క్రూపులస్ యూ అర్ ! థాంక్‌గాడ్ ! మొత్తానికి తెలుసుకుంది .. నీ నిజ రూపం బయట పడింది !...." వాడి ముఖంలో జుగుప్స చూడలేకపోతున్నాను.

"అది కాదురా ! అసలు ఏం జరిగిందంటే. .."

"నో ! నేను వినను ! ఈ క్షణం నుంచి వుయ్యార్ స్ట్రేంజర్స్! నీ ముఖం నాకు తెలియదు." మధు ఇంట్లోకి రెండడుగులు వేసి ఠక్కున నా వెనుక తలుపు మూసేశాడు.

ఆ క్షణంలోనే అవమానానికి తట్టుకోలేక నాకళ్ళల్లో నీళ్ళు తిరిగిపోయేయి!

ఆ తర్వాత ఎన్నో రోజులు ఆ సంఘటన నా హృదయం పిండివేసింది! మధు తలుపుమూస్తూన్న అదే దృశ్యం పదేపదే కళ్ళముందు నిలచేది

ఆలోచించిన కొలదీ ఆ అవమానం భరించరానిదిగా తయారైంది. లెక్కలేనన్నిసార్లు నా నేరం ఏమిటా అని తర్కించుకున్నాను.

నే నా క్షణంలో పూర్తిగా ఉద్రేకపూరితుణ్ణయినమాట నిజమే! కాని నిజం గుర్తించిన మరు క్షణంలోనే సిగ్గుపడిపోయేను. జరిగినంతవరకు నేనుకావాలని చేసిన నేరమేమీలేదు. నేను నిర్దోషిని.

ఆనాటినుండీ ఎలాగైనా నేను నిర్దోషినన్న విషయం మధు గ్రహించేలా చెయ్యాలనిపించింది! ఏం చెయ్యగలను! ఆ రోజునుంచీ మధుని గురించి ఏమీ తెలుసుకోడానికి ప్రయత్నించలేదు. కాలం గడచినకొద్దీ ఒక పగగా వాడి జ్ఞాపకాల్ని దూరంగా నెట్టేసేను. కాని పాతిక సంవత్సరాలు పైబడి పోయేక ఇప్పుడు... వాడదే ఉద్యోగంలో ఉన్నాడా? లేక మారేడా? ఇన్నాళ్ళూ ఏయే ఊళ్ళల్లో ఉన్నాడు? వాడి తల్లిదండ్రులు ఇప్పటిదాకా బ్రతికిఉండరు! ఎప్పుడు పోయేరో! ఎలా పోయేరో? భార్యతో అప్పటిలా అనురాగంతో ఉన్నాడా? పిల్లలెంతమందో? ఏం

చేస్తున్నారో? ఎన్నాళ్ళనుంచో మనసు పట్టించుకోని ప్రశ్నలెన్నో ఇప్పుడు ముసురుతున్నాయి!

ఇప్పుడెలా ఉంది ఉంటాడు మధు! నన్ను చూడగానే గుర్తుపడతాడా? నేను గుర్తుపడతానా?

అప్పుడు నాటకాల్లో హుందాగా ఉంటే ముసలివేషాలు వాడిచేత వేయించేవాణ్ణి! నాటకంలో పాత్రకు అవసరమైన రూపాన్నిబట్టి నెత్తిమీద తెల్లరంగు రాయించేవాడిని. వాటికి ఒకటి రెండు వేషాలకు బట్టతల విగ్గుకూడా తొడిగినట్లు గుర్తు.

వాడి ముసలి వేషాలన్నీ కళ్ళముందు తిరిగేయి.

సరిగ్గా ఆఫీసు టైమయిన పది నిమిషాలకు ఖాళీగా ఉన్న టేబిల్స్ మధ్య నుంచి నావైపు వస్తూన్న ఆకారాన్ని మధు అనుకునే పరిశీలనగా చూస్తున్నాను.

ఖరీదయిన బట్టలు వేసుకున్నాడు. వయసుతో బాగా ఒళ్ళు చేసి నిగనిగ లాడుతున్నాడు. కళ్ళచుట్టూ ఒడిలిపోయి గుంటలుతేరిఉన్నాయి. తీరా దగ్గరకు వచ్చేక వాడి మొహం చూస్తే నాటకాల ముసలివేషాల్లో ఎందులోనూ ఇమిడినట్లు లేడు. నా ఊహకు అందనట్లుగా ఇప్పుడు తెల్లజుట్టుకు నల్లరంగు వేసు కుంటున్నాడు. రంగులేసుకొని రెండు మూడు రోజులయిందేమో తెల్లజుట్టు మొదట్లో కొంచెం పెరిగి వెలవెల బోతూన్నట్లు మనిషిలో సహజంగా ఉన్న హుందాతనాన్ని కూడా తేల్చివేసి నట్లుంది.

"హౌడుయూడూ!" అని వస్తూనే చేయి చాచి నిలబడ్డాడు మధు.

నేనూ నిలబడి చేయి అందించేను కొంచెం విర్లిప్తంగా.

"యింటికి వెడదామా?" అన్నాడు వాడు.

నా మాటలు వాడు మాట్లాడుతూన్నట్లుంది. నేను ముభావంగా లేచేను.

"ఓ ఇరవై నిముషాల నడక. నడచి వెడదామా? బస్సులో వెడదామా?" అన్నాన్నేను.

"రోజూ నువ్వెలా వెడతావు?"

"నడిచే."

"చలో. నడిచే వెడదాం!"

కొంతసేపు ఇద్దరం నిశ్శబ్దంగా నడిచేం.

"చూడగానే గుర్తుపట్టగలిగేవా? మారిపోయేనా!" అన్నాడు మధు నవ్వు పెదవులమీదకు తెచ్చుకొని.

తల తిప్పి చూసేను. ఆ నవ్వులో పాత మధు చాలా ఉన్నాడు.

"కొంత మార్పు సహజమే కదా!" అన్నాన్నేను.

"ఇంకా ఎన్నాళ్ళుంది సర్వీసు?"

"అయిదు నెలలు."

"ఇల్లు స్వంతమా?"

"ఇంచుమించుగా. ఆఫీసు అప్పుతో కట్టేను. ఈ అయిదు నెలల్లోనూ తీరి పోతుంది."

"పిల్ల లెంతమంది ?"

"ముగ్గురు. ఇద్దరాడపిల్లలూ ఓ మగ పిల్లవాడు."

"అమ్మాయిలు పెద్దవాళ్ళా ?"

"అవును."

"పెళ్ళిళ్ళు ?...."

"పెద్దదాని కయింది. రెండో దానికి చూస్తున్నాను."

"ఏంచేస్తూంది ?"

"బ్యాంకులో గుమస్తాగా చేరి సంవత్సరం అయింది."

"అబ్బాయి ?"

"కాలేజిలో ఉన్నాడు."

"ఇంకా...."

"రెండు సంవత్సరాలకు గ్రాడ్యుయేషను అవుతుంది."

"నీకు రిటైర్‌మెంట్ తర్వాత...."

"పెన్షను వస్తుంది."

"ఏమాత్రం ?"

"నెలకు మూడువందలు...."

ఏంచెయ్యాలో తెలియక అడుగుతూన్నట్లు ఏది గుర్తుకొస్తే అది అడిగేస్తున్నాడు

కుశల ప్రశ్నలూ జవాబులూ కూడా వన్‌వే ట్రాఫిక్స్ అయ్యేయి. అడిగిన వాటికే సూటిగా కావల్సినంత వరకే జవాబు చెప్పేను. నాకేమీ అడగాలని అనిపించలేదు

ఇంటికి రాగానే మా ఆవిడ ఇద్దరికీ కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది.

వాడు కొంత కుతూహలంగా దాన్ని పరిశీలించి చూడడం చూసేను. నేను పరిచయం చేస్తాననుకున్నాడేమో మధ్యలో ఇబ్బందిగా రెండుసార్లు నావైపు చూసేడు.

నేను కాఫీ కప్పుమీంచి తల తిప్పలేదు మాఆవిడ లోపలకు వెళ్ళిపోయింది. ఇంక వాడికీ నా ముఖావం భరింపలేనిదిగా అనిపించిందేమో! "మా ఫామిలీ గురించి నీకేమీ వివరాలు తెలియవనుకుంటాను!" అన్నాడు వాడు. మారుమూల మనసులో వాడి పరిస్థితికి కొంచెం జాలికలుగుతూంది. కాని పిలచి ఇంటికి తీసుకెళ్ళి చెయ్యని నేరానికి ముఖంమీద తలుపు వేసేసినవాడిమీద జాలిపడడం అనవసరం అనిపించింది.

"ఆరోజు నుంచి ఒక విధంగా నీ గురించిన విషయాలన్నింటికీ దూరంగానే ఉన్నాను. నెవర్ బాదర్డ్ టు నో ఎనీథింగ్ ఎబౌట్యూ" అన్నాను కాని ఇప్పుడు మాత్రం వెదుక్కుంటూ ఎందుకొచ్చేడూ అన్న ప్రశ్న కొంచెం పీకుతూనే వుంది కాని చెప్పడం మాత్రం తన విధి అన్నట్లుగా మొదలుపెట్టేడు. " ఆ తర్వాత సుమారు పదిహేన్నరకు మా

ఆవిడ మగపిల్లవాడ్ని కని చచ్చి పోయింది...."

చటుక్కున వాడివైపు చూసేను- రెండుచేతులూ గడ్డాన్ని కానుకొని కూర్చొని ఎటో చూస్తూ చెప్తున్నాడు.

"....మా అమ్మా నాన్నా మరో ఆరు సంవత్సరా లనుకుంటాను ఏ జబ్బూ లేకుండా బాగానే ఉన్నారు. తర్వాత ఇద్దరూ రెండు నెలల వ్యవధిలోనే పోయేరు.... నేను మళ్ళీ పెళ్ళిచేసుకో లేదు. నేనూ మావాడే మిగిలేం. వాణ్ణే ప్రాణంగా చూసుకొని పెంచుకున్నాను. చదువులో బాగా వచ్చేడు. ఆరునెలల క్రితమే ఐఏయస్ సెలక్షను వచ్చింది. వారం రోజుల క్రితం రెగ్యులర్ పోస్టింగు వచ్చింది.

వాణ్ణి సెలక్షను రాగానే పెళ్ళిచేసుకో మన్నాను వాడు ఇప్పుడే పెళ్ళేమిటని మొరాయించేడు.

"దాంపత్య సుఖం అనుభవించడానికి తెలిసీ తెలియని వయస్సు ఇదే సరైనదిరా అన్నీ పరిశీలించి తెలుసుకోవడం మొద లయిన తర్వాత ఆనందం, పరవశం ఉండవు" అని బలవంత పెట్టి పెళ్ళిచూపు లకు ఒప్పించేను. అమ్మాయి సిటీలోనే హౌస్‌సర్జనుగా పనిచేస్తూంది చాలా అందంగా ఉంటుంది. చూసేక వాడూ లొంగిపోయేడు మూడు నెలల క్రితమే పెళ్ళయిపోయింది.

"నేనూ ఇల్లు కట్టేననుకో; రిటైరయి నెల రోజులయింది. మా వాడికి మంచి క్వార్టర్సు ఇచ్చేరు. నాయిల్లు అద్దెకిచ్చేసి తనతోనే ఉండాలని మావాడు చాలా పట్టుపడితే సరేనని మొన్నటివరకూ వాడింట్లోనే ఉండిపోయేను...."

నాకిదంతా అక్కర్లేని సొదలా అని పించింది. ఇప్పుడు వీడికొడుకు ఐఎఎస్ అయితే ఏమిటి; వీడి కోడలు హౌస్ సర్జన్ అయితే ఏమిటి?....

"... నిన్న ఉదయం నుంచీ నిన్ను కలుసుకోవాలని ఎంతో తపన పడిపో తున్నాను...." అన్నాడు మధు. ముఖంలో ఏదో ఆందోళన కనబడుతూంది.

"ఎందుకు?" అన్నాను అప్రయత్నంగా.

వాడు ఆ ప్రశ్నకోసమే ఎదురు చూస్తూన్నట్లు మొదలు పెట్టేడు. ....మొన్న సాయంత్రం నాలుగు గంట లకు ఏమీ తోచక ఏ ఇంగ్లీషు నవలైనా చదువుదామని పుస్తకం తెచ్చుకోడానికి మావాడి గదిలోకి వెళ్ళేను షెల్ఫు లోంచి ఒక్కొక్క పుస్తకమే తీసి పెడుతూ నచ్చేపుస్తకంకోసం వెదకు తున్నాను వెనకాల ఏదో ఒలికిడి అయి నట్లుంది. నేను పుస్తకాల ధోరణిలో వెనుదిరిగి చూడలేదు. రెండు నిముషాల తర్వాత బీరువా తలుపు చప్పుడయి నట్లుంటే వెనక్కు తిరిగేను

"మా కోడలు! పూర్తిగా నగ్నంగా ఉంది! వదిలేసిన చీర కింద కుప్పగా ఉంది. వెనక్కి తిరిగి బీరువాలోంచి ఏవో బట్టలు తీస్తోంది. నా పై ప్రాణం పై నే పోయింది. నన్ను చూసి ఉండదు.

"నేను కదిలితే ఒక తప్పు, కదలక పోతేఒక తప్పులా ఉంది. ఏం చెయ్యాలో తోచలేదు. దిక్కుతోచక అలాగే పక్క చూపులు చూస్తూ నిలబడడంకంటె ఏమీ చెప్పలేకపోయేను వణుకుతూన్న చేతిలోంచి పుస్తకం జారి క్రింద పడి పోయింది.

మా కోడలు ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది నన్ను చూసి కెవ్వన కేకపెట్టి, "మీరా!" అని వదిలిన చీర కప్పుకొని పక్క గదిలోకి పరుగెత్తి పోయింది

"మొన్న రాత్రంతా నిద్రలేదు ఆ అమ్మాయి ఏమనుకుంటుందో ఏమిటో, నేనేమీ చెప్పలేకపోతున్నాను! చెప్ప కుండానూ ఉండలేకపోతున్నాను!

నిన్న ఉదయం లేస్తూనే మావాడు నా దగ్గరకొచ్చేడు. తల వంచుకొని నావైపు చూడకుండా అన్నాడు.

"నాన్నా! మనింట్లోకి ఇంకా ఎవరూ అద్దెకు రాలేదు నువ్వు అక్కడ ఉండటమే మంచిదనిపిస్తూంది డబ్బేమైనా కావలిస్తే పంపుతూంటాను. నా అవసర మొంటే పిలిస్తే వస్తాను," అన్నాడు.

నాకు కాళ్ళక్రింద నేల కదిలిపో తున్నట్లనిపించింది.

"అదికాదురా! జరిగిందేమిటంటే. " అని చెప్పబోయేను. "నేనేమీ విన దలచుకోలేదు! ఈరోజే వెడితే బాగుంటుంది" అని వెళ్ళిపోయేడు. వెంటనే నువ్వు గుర్తుకొచ్చేవు! " మధు ఆగిపోయేడు. కొంచెంసేపుండి అన్నాడు.

" ఇన్నేళ్ళ తర్వాతనైనా ఈ సంఘటన జరిగింది కనుక నీవు ఏ పాపమూ ఎరిగిఉండకపోవచ్చునని స్ఫురించిందినాకు మావాడు నిజం తెలుసుకొనేందుకు ఇటువంటి సంఘటన వాడికి జరిగితే కాని ఎలా వీలవుతుంది! ఇంకోటి ఎందుకు జరుగుతుంది?.... నేను వాడి దృష్టిలో నా కొడుకుదృష్టిలో అన్ సుస్పెక్టెడ్ లస్ట్ ఫుల్ బీస్ట్‌ని! ఏది ఏమయినా ఇదొక్కటే నిన్నడగడానికి వచ్చేను " వాడికళ్ళకు కన్నీటిపొరలు కప్పేయి

"ఏమిటది?"

"రాజూ! నన్ను క్షమించవూ!" అన్నాడువాడు వణుకుతూన్న గొంతుతో.

వాడి చేతిని చేతిలోకి తీసుకొని సాను భూతితో నొక్కేను. నా చేతిమీద రెండు నులివేడి కన్నీటిచుక్కలు పడ్డాయి.